## అరువు పుస్తకం

"కర్నూల్ ట్రైన్ ఎన్నిగంటలకండీ!" అడుగుతూ బ్యాగ్ ప్రక్కన పెట్టి సిమెంట్ దిమ్మ మీద కూర్చున్నాడు మోహన్.

"తెలీదండీ! నేను డోన్-అంటే ఈ వేపు వెళ్ళాలి. కర్నూల్ ఆ వేపు. మొత్తానికి నా ట్రైన్ తర్వాతే మీ ట్రైన్" పేపర్ లోంచి తలెత్తి చెప్పాడా వ్యక్తి.

ఆ వ్యక్తి ప్రక్కన ఏదో వీక్లీ కనబడడంతో మోహన్‌లోని పుస్తక ప్రియుడు నిద్రలేచాడు

అయితే మోహన్‌లోని పుస్తక ప్రియునిదంతా అదో టైపు. పుస్తకాలు కొనకుండా, రైల్వే స్టేషన్‌లలోను, బస్సుల్లో ప్రక్కవారు చదివే పుస్తకాల్లోకి తొంగి తొంగి చూడడం, వారుగానుక్కుంటూ ఇవ్వాక ఆ పుస్తకం టైటిల్ దగ్గర్నుంచి, చివరి పేజీ వరకు చదివేయడం, వాళ్ళు దిగడమర్చిపోతే చల్లగా ఎత్తుకొచ్చేయడం - ఇవన్నీ ఆ పుస్తక ప్రియుని హాబీలు.



"సర్. ఆ వీక్లీ ఇస్తారా! జస్ట్ చూసిచ్చేస్తాను" అని అడిగి ఇప్పించుకొని అది చదవడంలో లీనమయ్యాడు.

పదిహేను నిముషాలు దాటాక, ట్రైన్ వచ్చింది. అది డోన్ వెళ్ళేది. పక్కనున్న వ్యక్తి గభాలున లేచి వెళ్ళి ఎక్కాడు.

'రైలు త్వరగా వెళ్ళిపోతే బాగుండు. మూడు రూపాయిల వీక్లీ ఫ్రీగా వస్తుంది' అనుకుంటుండగా ట్రైన్ కదిలింది.

విజయగర్వంతో అంతవరకూ పరిసరాలు కూడా పట్టించుకోనట్లుగా వీక్లీ చదివిన మోహన్ అప్పుడు వీక్లీలోంచి తలెత్తాడు. ఆ తర్వాత 'కెవ్' మని రైలు కంటే గట్టిగా కేకేశాడు. కారణం మోహన్ బ్యాగ్ లేదు. మోహన్ వీక్లీలో మునిగి వుండగా ట్రైన్ హడావుడిలో మోహన్ బ్యాగ్‌ను కూడా తీస్కొని రైలెక్కాడు ఆ వ్యక్తి.

నాల్గు జతల బట్టలు, బ్యాగ్‌లో అయితే భద్రంగా వుంటుందని లోపల అడుగున దాచిన వెయ్యి రూపాయిల క్యాష్ మోహన్ కళ్ళ ముందు కన్పించసాగాయి.

- ఎ.ఎస్. రాజశేఖర్



## జాతినిర్మాతలు

...పేదరికం ఓడుతున్న ఇల్లు. అరుగుపైన పాఠం చెబుతున్న పరమేశ్వరంగారు ఆ ఇంటి పేదరికానికి ప్రతినిధిలాగా ఉన్నారు. ఎలిమెంటరీ స్కూల్ టీచర్‌గా పనిచేసి రిటైరైనపరమేశ్వరం గారి ప్రస్తుత వ్యాపకం అది.

"నమస్కారం మేస్టారూ!" పలకరింపుకు తలెత్తి చూశారు- పరమేశ్వరంగారు. నలుగురైదుగురు యువకులు ఇంటిముందు గేటు తీసుకుని లోపలికి వస్తున్నారు. ఎవరా అని ఆయన పరకాయించి చూస్తుండగానే వాళ్ళు లోపలికివచ్చారు. వాళ్ళెవరో తెలియక పోయినా, "రండి నాయనా, రండి" అంటూ వాళ్ళని ఆహ్వానించి, వచ్చిన వాళ్ళని కూర్చోమనడం కోసం అటూ ఇటూ చూశారు తబ్బిబ్బుపడుతూ. ఆయన ఇబ్బందిని గ్రహించి వాళ్ళు అక్కడే ఆఅరుగుమీదనే కూర్చున్నారు. "అయ్యయ్యో! మీ బట్టలు పాడవుతాయి నాయనా" అని ఆయన నొచ్చుకుంటూ అంటున్నారే కాని, కుర్చీలలాంటి వేమీ ఆ పరిసరాలలో లేవని వచ్చినవాళ్ళకి అర్థం కావడానికి ఎంతో సేపు పట్టలేదు. "ఫర్వాలేదు మేస్టారూ! మీరలా కూర్చోండి. మీతో ఒక్కమాట మాట్లాడివెళ్ళిపోదామని వచ్చాం"-అన్నారు వాళ్ళు.

అంతవరకూ మేస్టారి ట్యూషన్ పిల్లలు ఆసక్తిగా వచ్చిన వాళ్ళనే చూస్తున్నారు. మేస్టారు పిల్లల్ని పంపించేసి, "ఇప్పుడు చెప్పండిబాబు మీరువచ్చిన పనేమిటో!" అన్నారు. వాళ్ళలో ఒకతను మాట్లాడాడు. "మేస్టారూ!

మేమంతా ఎలిమెంటరీ స్కూల్లో మీ దగ్గర చదువుకున్న మీ పాత విద్యార్థులం, మీరు నేర్పిన విద్య, విజ్ఞానం మా జీవితాలకు ఎంతో వెలుగునిచ్చింది. మీ దయవల్ల బాగా చదువుకుని ఉద్యోగస్థులమై వృద్ధిలోకి వచ్చాము. మీలాంటి మేస్టారి దగ్గర చదువుకోవడం మా అదృష్టం. ఇప్పుడు మీరు రిటైరైన సందర్భంగా మేమంతా కలిసి మీకు సన్మానం చేయాలని అనుకుంటున్నాము. మీరు దీనికి అంగీకరించాలని కోరడానికి వచ్చాం"

ఆ మాటలు విని నవ్వేశారు మేస్టారు "ఎందుకు బాబూనాకు సన్మానం? నావిధి నేను చేశాను. ప్రతిఫలంగా జీతం పుచ్చుకున్నాను కాని ఊరికే చెయ్యలేదు కదా? ఇక నాకు సన్మానమెందుకు?"

"మేస్టారూ! జీతం పుచ్చుకుని చేసినా మీరు మీ విధి నిర్వహణ చాలా ఆదర్శప్రాయంగా చేశారు. మీ వృత్తే దైవంగా భావించి అంకితభావంతో నిర్వహించిన మీలాటి ఉపాధ్యాయులకు ఎంత జీతం ఇచ్చినా ఆ ఋణం తీరేది కాదు. మీరు చేసిన సేవలో ఈ జీతాలు ఏపాటి? ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ఉపన్యాసాలు చెప్పడమే గాని, ఈ రాజకీయ నాయకులు, ప్రభుత్వం వాళ్ళకి ఒరగ బెడుతున్నదేముంది? భావి పౌరులను తీర్చిదిద్దడం కోసం ఎంతో కృషిచేసి, దేశానికి ఎంతో ఉపయోగపడుతున్న ఉపాధ్యాయులు పేదరికంలోనే మగ్గిపోతున్నారు. ఈ ఆదర్శాలు మాటలవరకే గాని, చేతలలోకి రావడం లేదు మేస్టారూ! కబుర్లు చెప్పే ఆచరణ శూన్యులైన ఈ నాయకుల కంటె, ఒక ఉపాధ్యాయుడు దేశానికి ఎక్కువ సేవ చేస్తున్నాడని, ఎక్కువ ప్రయోజనకారి అని చెప్పాలి. అందుకే మా మేస్టారిని మేము సన్మానించి మా కృతజ్ఞతలను తెలియజేసుకోవాలనుకుంటున్నాం"- సిన్సియర్‌గా రవి చెబుతున్న మాటలను మేస్టారు కాదనలేక పోయారు.

** ** **

సన్మానం తేదీ నిశ్చయమైంది. రవి ఆ విషయం చెప్పడానికి మేస్టారి ఇంటికి వచ్చాడు. బైట ఎవరూ కని

